ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 • కనిష్ఠం 25.6
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 1 ఆగస్టు 2025





సూర్యాపూర్ చెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీరు



భైంసా మున్సిపల్ కార్యాలయం

స్వచ్ఛతకు నిధులు

- జిల్లాలోని మూడు మునిసిపాలిటీలకు రూ. 25.25 లక్షల నిధులు

భైంసా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిధులు లేక నిర్వహణలో ఇబ్బంది పడుతున్న మున్సిపాలిటీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పట్టణాలకు స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిధులు విడుదల చేస్తూ సీడీఎం, స్టేట్ మిషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు రూ.25.25 లక్షల నిధులు విడుదల చేశారు. ఇందులో భైంసా మున్సిపాల్టీకి రూ. 7.76లక్షలు, నిర్మల్ మున్సిపాల్టీకి రూ. 13.50లక్షలు, ఖానాపూర్ మున్సిపాల్టీకి రూ. 3.99లక్షల నిధులను కేటాయించారు.

- మెరుగుపడనున్న సౌకర్యాలు

పట్టణాల్లో ఆస్తి, నీటి, ట్రేడ్ లైసెన్స్ పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో కార్యాలయ నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. ఆదాయం తక్కువగా ఉండడంతో స్వచ్ఛతకు ఎక్కువ నిధులు కేటాయించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మున్సిపాల్టీలకు సరైన నిధులు లేక ఆదాయం రాక కార్యాలయ భవనాల నిర్వహణ, టాయిలెట్ల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయ వనరులు తగ్గడంతో మున్సిపాల్టీలపై భారం పెరిగింది. ఈ తరుణంలో ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిధులు విడుదల చేయడంతో మున్సిపాల్టీల్లో సౌకర్యాలు మెరుగయ్యే అవకాశముంది.

- ఉత్తమ ర్యాంకు సాధిస్తాం

: రాజేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్, భైంసా

స్వచ్ఛ భారత్ మిషన్ నిధులను స్వచ్ఛత కార్యక్రమాలకు వినియోగిస్తాం. డంపింగ్ యార్డు అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, తదితర కార్యక్రమాలు చేపడుతాం. అందరి కృషితో స్వచ్ఛ భారత్ మిషన్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు కృషి చేస్తాం. సీడీఎంఏ అనుమతితో ఈ నిధులు వినియోగిస్తాం.





విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేస్తున్న టీచర్

- నేటి నుంచి జిల్లాలోని 756 పాఠశాలల్లో అమలు
- ఉదయం, సాయంత్రం రెండు పూటల ఇక హాజరు విధానం
- ఎఫ్‌ఆర్‌ఎస్‌తో ఇకపై డుమ్మాలకు చెక్
- పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు

సర్కారు టీచర్లకు.. ముఖ హాజరు

నిర్మల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకే పరిమితమైన ఫేషియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్(ఎఫ్‌ఆర్‌ఎస్) ముఖ హాజరును ఇక నుంచి ఆ స్కూల్‌లో పని చేస్తున్న టీచర్లకు సైతం వర్తింపజేయబోతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9గంటలకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానాన్ని విద్యార్థుల కోసం కొంతకాలంగా అమలు చేస్తున్నారు. దీంతో విద్యార్థుల హాజరుపై తప్పుడు లెక్కలు చూపే అవకాశం లేకుండా పోయింది. మధ్యాహ్న భోజనంతో పాటు ఇతర సౌకర్యాల కల్పనకు ఈ ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరునే ప్రమాణికంగా తీసుకుంటున్నారు. అయితే ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమలులో లేనప్పుడు టీచర్లు విద్యార్థుల హాజరును ఇష్టారాజ్యంగా చూపే వారన్న ఆరోపణలున్నాయి. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానాన్ని అమలు చేసినప్పటి నుంచి లెక్కలన్ని పక్కాగా నిర్ధారణ అవుతున్నాయి. అయితే విద్యార్థులకు అమలు చేస్తున్న ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంతో తప్పుడు హాజరు లెక్కలకు చెక్ పడుతున్న కారణంగా ఇదే విధానాన్ని టీచర్లకు కూడా వర్తింపజేయాలని గత కొంతకాలం నుంచి సంబంధిత అధికారులు కసరత్తులు చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ సైతం ఈ విషయంలో ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మొదట టీచర్లకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానం అమలు కోసం పెద్దపెల్లి జిల్లాను పైలేట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ ఈ హాజరు ను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. పెద్దపెల్లి జిల్లాలో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానం విజయవంతం కావడంతో ఇక రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా టీచర్లకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానా న్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర విద్యాశాఖ అన్ని డీఈవో కార్యాలయాలకు పంపింది. దీనికి అనుగుణంగా సంబంధిత డీఈవోలు సైతం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్‌కు సంబంధించి మార్గదర్శకాలను వివరించారు. దీనికి అనుగుణంగా శుక్రవారం ఉదయం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాలలు, మోడల్ స్కూల్‌లలో కూడా ఈ విధానాన్ని అమలు చేయబోతున్నారు.

జిల్లాలో 756 పాఠశాలల్లో అమలు

జిల్లాలో మొత్తం 756 ప్రభుత్వ పాఠశాలలుండగా.. ఇందులో నుంచి 735 ప్రభుత్వ, లోక్ బాడీ పాఠశాలలు ఉన్నాయి. దీంతో పాటు 18 కేజీబీవీ పాఠశాలలు అలాగే ఓ ఆదర్శ పాఠశాల, మరో యూఆర్‌ఎస్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. మొత్తం ఈ పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానంను అమలు చేయబోతున్నారు. అయితే బాసర కేజీబీవీ పాఠశాలలో మాత్రం ఈ విధానాన్ని నిలిపివేశారు. జిల్లాలోని మొత్తం 756 పాఠశాలలకు గాను 2900 టీచర్ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం 300 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్క ప్రకారం జిల్లాలోని 2600 మంది టీచర్లకు శుక్రవారం నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును అమలు చేయబోతున్నారు.

ఇక నుంచి రెండు పూటల హాజరు

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును అమలు చేస్తుండగా శుక్రవారం నుంచి ప్రభుత్వ టీచర్లకు కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు మ్యానువల్ పద్ధతిలో ఉదయం, సాయంత్రం పూట టీచర్లకు హాజరు తీసుకుంటున్నప్పటికీ ఇక నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్‌లో కూడా ఉదయం 9గంటలకు సాయంత్రం 4.15 నిమిషాలకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటికే జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్ సక్రమంగా అందకపోతున్న కారణంగా విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్‌కు ఆటంకాలు కలుగుతున్నాయి. అయితే ఎఫ్‌ఆర్‌ఎస్ కారణంగా టీచర్లపై అదనపు భారం పడుతుందని అలాగే సిగ్నల్స్ అందక విద్యాబోధనకు సైతం ఆటంకాలు ఎదురవుతున్నాయని అంటున్నారు. విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్‌తో ఇప్పటికే కుస్తీ పడుతున్న టీచర్లు ఇక తమ హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంతో నమోదు చేసే విషయంలో మరిన్ని ఆటంకాలు ఎదుర్కొనే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సంఘాలు

విద్యాశాఖ టీచర్ల హాజరు కోసం అమలు చేయబోతున్న ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంపై పలు ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న టీచర్లకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానం మరింత భారమయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. జిల్లాలోని ఖానాపూర్, పెంబి, మామడ, దస్తూరాబాద్‌తో పాటు తదితర మారుమూల మండలాల్లోని గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్ కోసం టీచర్లు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తంటాలు పడుతున్నారని వారు పేర్కొంటున్నారు. ఇంతలోనే టీచర్లకు సైతం ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని అమలు చేస్తుండడంతో ఈ వ్యవహారం అదనపు సమస్యగా మారనుందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న విధానాన్నే కొనసాగించాలని వారు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం

కుంటాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం మూలంగా చెరువు తూము లీకేజీతో రైతులకు శాపంగా మారింది. మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన చెరువు ఆయకట్టు కింద 450 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే గత కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం చెరువు మరమ్మతుల కోసం రూ.10 లక్షలు మంజూరు చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూము లీకేజీతో పాటు అస్తవ్యస్తంగా ఉన్న కెనాల్‌కు సైతం మరమ్మతులు చేపట్టకుండా అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అవసరం లేనిచోట పనులు చేపట్టి అవసరమున్న చోట మరమ్మతులు చేపట్టలేదన్నారు. నీరు ఇలాగే వృథాగా పోతే చెరువు ఆయకట్టు కింద ఉన్న తమ పంటలు ఎలా పండుతాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లకు వరంగా మారి రైతులకు శాపంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. ఇకనైనా చెరువు మరమ్మతులు చేపట్టాలని సూర్యాపూర్ గ్రామ రైతులు పేర్కొంటున్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

దిలావర్‌పూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో మొక్కలే కీలకమని దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించిన అనంతరం మాట్లాడారు. జీవరాశి స్వచ్ఛమైన ప్రాణవాయువు చెట్ల నుంచే లభ్యమవుతుందన్నారు. అలాగే వాయు కాలుష్యానికి అడ్డుకట్ట వేసేది కూడా చెట్లేనని అన్నారు. భూమిపై జీవ కోటి మనుగడకు మొక్కలే మూలాధారమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకేష్, నవీన్ రెడ్డి, సురేష్, సతీష్, రాజశేఖర్, నరేష్, చంద్రకళ, నాగమణి, ప్రతిభ, భారతి, నిఖిల, శరణ్య, సుమలత, నిఖిత, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న దృశ్యం

పాఠశాలల్లో సమస్యలు తెలిపేందుకు ఫిర్యాదుల పెట్టె

- మస్కాపూర్ పాఠశాలలో వినూత్న యత్నం

ఖానాపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో సమస్యలను ఉపాధ్యాయులకు నేరుగా తెలిపేందుకు ఇబ్బంది పడే విద్యార్థుల కోసం పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల, సలహాల స్వీకరణ పెట్టెను పదవ తరగతి విద్యార్థులచే ప్రారంభించారు. విద్యార్థులు కాకుండా తల్లిదండ్రులు సైతం పాఠశాలకు సంబంధించి ఏదూనా నిర్మాణాత్మక సూచనలను చేయాలనుకుంటే ఈ ఫిర్యాదుల పెట్టె ద్వారా చేయవచ్చన్నారు. నిర్మాణాత్మక సూచనలతో పాఠశాల అభివృద్ధి మరింత పారదర్శకంగా జరుగుతుందని నరేందర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులైన వెన్న అంజయ్య, షేక్ ఇమ్రాన్, గడప దీప్తి, లక్ష్మణ ర ఆవు, తదితరులున్నారు.

ఆయిల్ పామ్‌పై అవగాహన

కుబీర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోనారిలో గురువారం రైతులకు ఆయిల్ పామ్ చెట్ల గురించి వ్యవసాయ క్లస్టర్ అధికారి యోగేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆయిల్‌పామ్ చెట్ల ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని, ప్రభుత్వం మంచి ప్రోత్సహకాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని రైతులు మంచి దిగుబడులు పొందవచ్చని చెప్పారు. రైతులకు రాయితీ వివరాలు తెలియజేసి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎఫ్‌ఏ గంగాధర్, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ద్వారా హస్తకళలకు ప్రోత్సాహం

- జాతీయ స్థాయిలో పెంబి మండల ఆస్పిరేషన్ బ్లాక్‌కు నాలుగవ స్థానం రావడం గర్వకారణం
- ఆకాంక్ష హాట్ కార్యక్రమం ప్రారంభ వేడుకల్లో కలెక్టర్ అభిలాష అభినవ్
- పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా అధికారులు, మహిళా సంఘాలు,

నిర్మల్ చైన్‌గేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మహిళల ఆలోచనలను వెలుగులోకి తెచ్చేందుకు మహిళా సంఘాలు తోడ్పాటును ఇస్తాయని, మహిళా సంఘాల ద్వారా హస్తకళలకు ప్రోత్సాహం లభిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఆకాంక్ష హాట్ కార్యక్రమాన్ని కలెక్టర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శనలను ఎమ్మెల్యేతో కలిసి వీక్షించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో పెంబి మండలంలో చేపట్టిన కార్యక్రమాలకు గాను దేశవ్యాప్తంగా 500 మండలాలకు గాను పెంబి మండలానికి 4వ ర్యాంక్ వచ్చిందన్నారు. పెంబి మండలాన్ని ఉత్తమ మండలంగా తీర్చేలా కృషి చేసిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే పలువురు జిల్లా, ఉన్నత స్థాయి అధికారులు రాష్ట్రస్థాయిలో జరగబోయే కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకాన్ని అందుకోనున్నట్లు తెలిపారు. పెంబి మండలాన్ని ఆస్పిరేషన్ నుంచి ఇన్స్పిరేషన్ మండలంగా మార్చామన్నారు. మూడు నెలల పాటు జరిగిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం వల్ల సాధ్యమైందన్నారు. పెంబి మండలానికి విద్య, వైద్యం, వ్యవసాయం, పోషణ, సాంఘిక అభివృద్ధి అంశాల్లో మెరుగైన వృద్ధి సాధించామని తెలిపారు. కాగా, నీతి అయోగ్ ఆకాంక్ష హాట్ కార్యక్రమం నేటి నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులపాటు మహిళా సంఘాల హస్తకళలు ప్రదర్శనలతో పాటు అమ్మకాలు ఉంటాయని చెప్పారు. ఆ తర్వాత ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ నీతి అయోగ్ పెంబి ఆస్పిరేషన్ బ్లాక్‌నకు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంక్ రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలను ప్రదర్శించారు. పెంబి మండల అధికారులు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎం, ఆశాలు, ఇతర ఫ్రంట్ లైన్ ఉద్యోగులను కలెక్టర్, ఎమ్మెల్యేలు శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా అధికారులు, పెంబి మండల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, మహిళా స్వయం సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

- నూతన రేషన్‌కార్డులతో పేద ప్రజలకు ఆహారభద్రత

తానూరు: ప్రభుత్వం అందిస్తున్న నూతన రేషన్ కార్డుల వల్ల పేద ప్రజలకు ఆహార భద్రత కలుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం తానూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల పంపిణీతో పేద ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు. ఇందులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేంధర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ మహేందర్‌నాథ్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణరావు పటేల్, సీనియన్ నాయకులు చిన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ గోప సాయినాథ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తానూరు: ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్, ఔట్ పేషంట్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే రామారావు పటేల్



పోలీసు అక్కలతో ఎస్పీ జానకీ షర్మిల

గంజా గస్తీకి పోలీసు అక్కలు సిద్ధం : ఎస్పీ

నిర్మల్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గంజా గస్తీకి పోలీసు అక్కలు సిద్ధమైనట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల గురువారం పోలీసు అక్కలుగా పని చేస్తున్న మహిళా పోలీస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి, మిషన్ గంజా గస్తీ కింద బలమైన సందేశాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత ఆరు నెలలుగా కేజీబీవీ పాఠశాలల్లో పోలీసు అక్కలు నేరుగా పిల్లల చెంతకు వెళ్లి నెలలో ఒక్కరోజు వారితో గడిపి విద్యార్థుల సాధక బాధకాలను తెలుసుకుంటున్నారన్నారు. వారిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేలా తమ పాత్రను నిర్వహిస్తారని తెలిపారు. సమీక్ష అనంతరం గంజా గస్తీ ప్రచారంలో పాల్గొననున్న పోలీసు అక్కలకు బ్యాడ్జీలు, బ్యాగులు, టీ షర్టులు పంపిణీ చేశారు.

పబ్లిక్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

నిర్మల్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరమునకు హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన గిరిజన బాలికలకు- 3, బాలురకు- 3 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆగస్టు 8వ తేదీలోగా తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం నిర్మల్ నందు సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 12వ తేదీన డ్రా తీయుట ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామాలు : రావుల

నిర్మల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కార్ బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామాలాడుతోందని, రిజర్వేషన్ల పేరుతో రేవంత్ సర్కార్ కుట్ర చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం నిర్మల్ బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజే, బీజేవైఎం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీసీ సంఘం నేత పొన్నం నారాయణ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు అయ్యన్నగారి రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కే.శ్రావణ్, విజయ్ గిల్లి, తదతరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన

సారంగాపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల ఆరు ఎకరాల 32 గుంటల భూమిని కోర్టు భవన నిర్మాణానికి స్థలాన్ని రెవెన్యూ, న్యాయశాఖ అధికారులు గురువారం పరిశీలించి కోర్టు భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ స్థల పరిశీలనలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, ఆర్డీవో రత్నకళ, తహసీల్దార్ శ్రీదేవిలతో పాటు న్యాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కోర్టు భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

క్షేత్రస్థాయిలో పథకాల అమలు పరిశీలనకే జనహిత పాదయాత్ర

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- 3, 4వ తేదీల్లో ఖానాపూర్ మండలంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ల పర్యటన

ఖానాపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న విధానాన్ని పరిశీలించేందుకు జనహిత పాదయాత్రతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రజల్లోకి వస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రాంభూపాల్ పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 3, 4వ తేదీల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు జనహిత యాత్రలో భాగంగా ఖానాపూర్‌లో పర్యటిస్తారన్నారు. 3వ తేదీన బాధనకుర్తి, సుర్జాపూర్, మస్కాపూర్ మీదుగా జనహిత పాదయాత్ర ఖానాపూర్ చేరుకుంటుందన్నారు. ఖానాపూర్‌లో పాత బస్టాండ్ మీదుగా మున్సిపల్ కార్యాలయం, శివాజీ నగర్, ఎన్టీఆర్ చౌక్ మీదుగా తెలంగాణ చౌక్ వరకు పాదయాత్ర నిర్వహిస్తారన్నారు. తెలంగాణ చౌక్‌లో పాదయాత్ర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి ఖానాపూర్‌లోని జేకే ఫంక్షన్ హాల్‌లో నేతలు బస చేస్తారన్నారు. 4వ తేదీన ఉదయం బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శ్రమదానం నిర్వహిస్తారన్నారు. అనంతరం స్థానిక జేకే ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్‌లు సమావేశం అవుతారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను పార్టీ శ్రేణులతో చర్చించి దిశానిర్దేశం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలో 1500-2వేల మంది కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చే కాంగ్రెస్ శ్రేణులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సహా పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్న ఈ జనహిత పాదయాత్రను ఉమ్మడి జిల్లా నాయకులు జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూమన్న, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, జిల్లా నాయకులు యూసఫ్ ఖాన్, మడిగెల గంగాధర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

లిఫ్ట్ ఇరిగేషన్ల ఏర్పాటు కోసం డ్రోన్ సర్వే



పొచ్చెరలో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్ అధికారులు, పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని పొచ్చెరా, నేరడిగొండ మండలంలోని తేజపూర్ గ్రామాల రైతుల భూములకు సాగునీరు అందించాలన్న దృక్పథంతో స్థానిక శాసనసభ్యులు అనిల్ విన్నపం మేరకు ఇరిగేషన్ అధికారులు గురువారం డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. రెండు మండలాల రైతులకు ఉపయోగపడే పొచ్చెర లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దాదాపు 3 ఎకరాలకు సాగునీరు అందే ఆస్కారం ఉందని ఇరిగేషన్ డీఈ భీమ్రావు పేర్కొన్నారు. పెద్దవాగుపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం వల్ల నీటి నిల్వలు పెరగడంతో లిఫ్ట్ ఇరిగేషన్లకు అవకాశం ఉండడంవల్ల అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టారు. ఏది ఏమైనా స్థానిక శాసనసభ్యులు అధికారుల కృషి వల్ల లిఫ్ట్ ఇరిగేషన్లు చేపడితే స్థానిక రైతుల బీడు భూముల్లో పంటలు పండించుకునే ఆస్కారం ఉంది. కాగా గతంలో ఏర్పాటు చేసిన పోచ్చేరా సమీపంలో లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

పోక్సో చట్టంపైన అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సరస్వతి

ఉట్నూర్,జూలై31 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపైన మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం మహిళ ఉద్యోగులకు, యాక్షన్ ఎయిడ్ ఏకేపీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాక్షన్ ఎయిడ్ (ఏకేపీ) కమ్యూనిటీ ట్రైనర్ మర్సుకోల సరస్వతి మాట్లాడుతూ.. పని ప్రదేశాలలో ఉద్యోగులు కార్మికులు ఇతర మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టంపైన సంపూర్ణ అవగాహన కలిగి పని ప్రదేశాలలో ఎవరికైనా లైంగిక వేధింపులు జరిగితే దాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ సహాయకుడికి ఘన సన్మానం

నిర్మల్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ శాఖలో గత 32 సంవత్సరాలుగా కార్యాలయ సహాయకుడిగా సమర్థవంతంగా సేవలందించిన గంగాధర్‌ను గురువారం పదవి విరమణ సందర్భంగా జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొని ఆయన సేవలను ప్రశంసించారు.

లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుల ముందస్తు అరెస్టు



భరత్‌చౌహాన్ అరెస్టు చేసిన పోలీసు

ఉట్నూర్; జూలై31(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సీఎంరేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడీ గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వాలంటూ గురువారం లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన చలో గాంధీభవన్ కార్యక్రమానికి వెళ్లకుండా ఉట్నూర్ మండల కేంద్రంలోనే లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులను ఉట్నూర్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌చౌహాన్‌తో పాటు సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఉట్నూర్ అధ్యక్షులు జాదవ్‌మధుకర్, ఎల్‌హెచ్‌పీఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాదవ్‌చంద్రకాంత్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి పవర్‌గంగారాంనాయక్‌లను అరెస్టు చేశారు.

బోథ్: గాంధీ భవన్ ముట్టడికి వెళుతున్న గిరిజన లంబాడి ఐక్యవేదిక బోథ్ మండల అధ్యక్షుడు సచిన్ రాథోడ్‌ని బుధవారం రాత్రి బోథ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోతే రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మాంసం విక్రయ దుకాణాల పరిశీలన

బజార్‌హత్నూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పశువైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ హైమద్ గురువారం చికెన్, మటన్ మాసం విక్రయ దుకాణాలను పరిశీలించారు. విక్రయదారులు దుకాణాలు పరిశుభ్రంగా ఉంచాలని, మాంసాన్ని కప్పిఉంచాలని లేదంటే ఆనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఆయనతో పాటు సిబ్బంది మారుతి, ఉన్నారు.

డిమాండ్ల సాధనే లక్ష్యంగా రిలే దీక్షలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్న డిమాండ్‌తో ఆగస్టు 4న కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యకు డిమాండ్

బోథ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌టి బాలుర వసతి గృహంలో ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి కాలికి గాయమైంది. దీంతో ఉపాధ్యాయుడుపై చర్యలు విద్యార్థి సంఘాల వారు డిమాండ్ చేశారు. బుధవారం ఈ సంఘటన చోటు చేసుకోవడంతో హాస్టల్‌లో విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ వారు సందర్శించారు. కాగా జరిగిన సంఘటన గురించి విద్యార్థులు జిల్లా ఐటిడిఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జరిగిన సంఘటనపై తగు విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘం వారు డిమాండ్ చేశారు.ఒకరిద్దరూ విద్యార్థులు కావాలని సమస్యను సృష్టిస్తున్నారని ఉదయం పూట లేచి చదువుకోవాలని చెబితే వినకుండా హాస్టల్‌లో ఈ విధంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు.

రాములగుట్టకు కప్పర్ల రైతులు

తాంసి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):ప్రతిశ్రావణమాసంలో రాముల గుట్టకు వెళ్లి రాములోరికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కప్పర్ల గ్రామ రైతులు కాలినడకన గుట్టకు బయలుదేరారు. గుట్టపై వెలిసిన శ్రీ రామ లక్ష్మణ సీతా సహిత విగ్రహాలకు ప్రత్యేక పూజ నిర్వహించారు. నమో పార్వతీ పతిహారార మహాదేవ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

గుడిహత్నూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మల్లెపూల నర్సయ్యను గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తిపు లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. నరేష్ జాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆడే శీల, నాయకులు మహేందర్ దేవ్ రావ్,తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థికి కన్నీటి వీడ్కోలు

▸▸ కుటుంబ సభ్యులకు భౌతిక కాయం అందించిన రిమ్స్ యాజమాన్యం



నివాళులు అర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రిమ్స్ మెడికల్ కళాశాల వసతి గృహంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఎం.బీ.బీ.ఎస్ విద్యార్థి సాహిల్ చౌదరి ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపింది. బుధవారం ఉదయం టిఫిన్ చేసిన తర్వాత రూమ్‌లో విద్యార్థి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని తనువు చాలించాడు. తోటి విద్యార్థులు స్పందించి వెంటనే సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ సైతం త్రీ మెన్ కమిటీ తో అంతర్గత విచారణ జరిపిస్తామని తెలిపారు. కాగ.... గురువారం ఉదయం విద్యార్థి మృత దేహానికి పోస్ట్ మార్టం నిర్వహించారు. రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి వచ్చిన విద్యార్థి కుటుంబీకుల రోదనలు అక్కడున్న వారిని కలిచివేసాయి. బాధిత కుటుంబ సభ్యులకు భౌతిక కాయాన్ని అందించిన సమయంలో విద్యార్థులంతా కన్నీటి పర్యంతమయ్యారు. రిమ్స్ డైరెక్టర్‌తోపాటు ప్రొఫెసర్‌లు, సిబ్బంది, విద్యార్థులు సాహిల్ చౌదరి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. బాధాతప్త హృదయాలతో తమ నేస్తానికి వీడ్కోలు పాలికారు. బాధిత కుటుంబ సభ్యులు రోదించిన తీరు విద్యార్థులను తీవ్రంగా కలిచివేసింది. కాగా... విద్యార్థి ఆత్మహత్యకు స్పష్టమైన కారణాలు కానరాకపోవడం మాత్రం అంతుపట్టడం లేదు. అందరితో కలివిడిగా ఉంటూ.. చదువుల్లోనూ చురుకుగా ఉండే సాహిల్ ఆత్మహత్య చేసుకోవడాన్ని విద్యార్థులు జీర్ణించుకోలేక పోతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు సైతం సాహిల్ ఆత్మహత్య విషయం తెలిసిన నాటి నుంచి విస్తుపోయి... విషాదంలో మునిగిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పార్టీ కోసం శ్రమించే వారికి గుర్తింపు ఉంటుంది

● ఆత్మ కమిటీ రైతులకు మరింత చేరువ కావాలి ● ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ



ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.గురువారం ఖానాపూర్‌లోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఖానాపూర్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ నిర్మల్ జిల్లాఇన్‌చార్జి రాంభూపాల్‌పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌లతో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన ఆత్మ కమిటీ రైతులకు నిరంతరం సన్నిహితంగా ఉండాలని సూచించారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులవాడకాన్ని తగ్గించిసేంద్రియ ఎరువుల వాడకం పెంపొందించేలా ఆత్మకమిటీ రైతులకుఎప్పటికప్పుడు అవగాహనకల్పించాలన్నారు.

● ఆత్మ కమిటీ చైర్మన్‌గా తోట సత్యం...

ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఖానాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట సత్యం అలియాస్ గాడ్పు సత్యనారాయణ నియమితులయ్యారు. గురువారం స్థానిక శాసన సభ్యులు బొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రాంభూపాల్ పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్‌ల సమక్షంలో తోట సత్యం ప్రమాణ స్వీకారం చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం సహా సభ్యులుగా అలుగుల శంకర్, బైరి మల్లేష్, సార్ల నర్సయ్య, ఎండీ అబ్దుల్ నబీ, రేండ్ల రమాదేవి, బొడ్డు నర్సయ్య, సింగం సుంగు పటేల్, అంగోత్ గంగాధర్, బోరె రమేష్, గొర్ల రాజన్న, గోపాల్ రావు, కే. భూమన్న, మెస్రం బాలాజీ, కొర్ర జల్ సింగ్, డి. రాజశేఖర్, బేదాడ అంజి, కొప్పరాల వేణుగోపాల్, ముత్యం రమేష్, బొమ్మెన ఆనంద్, మెస్రం సురేందర్, పొద్దుటూరు వాణి, గోనె వెంకటవ్వ, దర్శనాల వెంకటేశ్వర్, కే. లక్ష్మీనారాయణలతో ఏడీఏ సుజాత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూమన్న, పీఏసీఎస్ చైర్మన్లు ఇప్ప సత్యనారాయణ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యత మీద ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి

పెంబి: ఆర్థిక అక్షరాస్యత మీద ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం పెంబి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో లీడ్ భారతీయ రిజర్వ్ బ్యాంక్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆర్థిక అక్షరాస్యత మీద అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెడ్మ బొజ్జు మాట్లాడుతూ... ప్రజలు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దుబారా ఖర్చులు చేయకుండా డబ్బులను పొదుపు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో అంబాజీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, తులాల శంకర్, సుతారి రమేష్, అశోక్ రావు, రాజన్న, గుడిసె రమేష్, స్వామి, ఖాన్, ఆర్‌బీఐ సిబ్బంది, ఉపాధ్యాయులు భూక్యా గోవింద్, వెంకట్రావు, జైసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలని ధర్నా

కుంటాల, జూలై, 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాల నుండి ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. కల్లూరు ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. దాదాపు 68 వరకు విద్యార్థులు ఉన్నారు. అయితే ఇక్కడ ఐదుగురు ఉపాధ్యాయుల నుండి ఇద్దరు ఉపాధ్యాయులను అధికారులు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఉదయం పాఠశాల గేటుకు తాళం వేసి భైంసా- నిర్మల్ రహదారిపై ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కమల్ సింగ్, ఎస్సై అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించి ధర్నా విరమింపజేశారు. పరిస్థితి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. దాదాపు గంట సేపు ధర్నా నిర్వహించడంతో రోడ్డుకు ఇరు వైపులా నిలిచిపోయాయి.

అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

తలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తనుమడుగు మండలంలోని తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన లక్ష్మంపూర్ చెక్ పోస్టు వద్ద గురువారం ఎస్పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్ పోస్టు వద్ద అదిలాబాద్ రూరల్ సిఐ ఆధ్వర్యంలో తలమడుగు ఎస్ఐ, ఆర్ఎస్ఐ విజయ్ తలమడుగు సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ ఆధ్వర్యంలో నాకాబంది నిర్వహించడం జరిగిందని ఎస్సై రాధిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, వాహనాలు ఇలాంటి వస్తువులు తరలిస్తున్న వాటి వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా చెక్‌పోస్టు వద్ద ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందులో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాంసి: వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో అంతర్ రాష్ట్ర రహదారిపై తాంసి పోలీసుల బృందం ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనదారునికి సంబంధించిన పత్రాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై జీవన్ రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అనుమతి లేని సరుకులను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఉత్తమ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సంతోష్‌పాల్గొన్నారు.

కామాటీలకు షోకాస్ నోటీసులు

● ఉపాధ్యాయునికి స్థానచలనం

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని గురువారం మధ్యాహ్నం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్త ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని స్టాకు రిజిస్టర్‌తో పాటు విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అంతేగాక కూరగాయలు, ఆకుకూరలు వంట సామాగ్రిని పరిశీలించడం జరిగింది. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని సూచించారు.విద్యార్థులకు మరుగుదొడ్లు, త్రాగునీటి వసతులను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో సంబంధిత ఏఈకి ఫోన్ చేసి సత్వరమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పిల్లలకు సరైన భోజనం అం దించటం లేదని మెనూ ప్రకారం భోజనాన్ని నిర్వహించడం లేదని పరిశీలనలో తేలడంతో ఇరువురికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగింది.అయితే విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడికి స్థాన చలనం బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేద కుటుంబాలకు సహాయం చేయడం ఓ వరం

● సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్

నార్నూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇపుడు ఉన్న పోటీ ప్రపంచంలో అభివృద్ధి అనే మార్గానికి చాలా మంది దూరంగా ఉన్నారు. వాస్తవానికి పేదరికం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది చాలా కుటుంబాలకు ఏదో ఒక్క అంశం వలన ఇబ్బంది పడుతూ అప్పన్న హస్తం కోసం ఎదురు చూస్తుంటారు. విద్య వైద్యం, నిరుద్యోగం,పెండ్లి అనే సమస్యలు వారి చుట్టు భూగోళం తిరిగినట్లే తిరుగుతున్నాయి. కానీ నార్నూర్ మండల కేంద్రం కాదు ఇతర ప్రాంత వాసులకు సైతం ఆపాద వస్తే తను ఉన్న అనే పెద్ద ధైర్యం ఇచ్చేది నాయకుడుగా ముడు సార్లు సర్పంచ్, సమాజం ఇతర పదవులపై సేవలు అందించిన వ్యక్తి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్ మంచి పేరు ఉంది.

ఘనంగా ఉద్ధమ్ సింగ్ వర్ధంతి

ముథోల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధుడు 'ఉద్ధమ్ సింగ్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్థన సమయంలో ఉద్ధమ్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్ధమ్ సింగ్ త్యాగాన్ని, అతని పోరాటాన్ని పిల్లలకు వివరించారు. ఉద్ధమ్ సింగ్ చరిత్ర మరువని వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు భగవాన్ దాస్, ప్రధానాచార్యులు సారధి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న శర్మ, ఆచార్యులు, విద్యార్థులు, తదితరులున్నారు.

కూలీ పనికోసం వచ్చి ఆకస్మిక మరణం

కుంటాల, జూలై, 31 : (ఆంధ్రజ్యోతి) : పక్క రాష్ట్రం మహారాష్ట్రలో ఉపాధి లేక కూలీ పనికోసం వచ్చి ఆకస్మికంగా మరణించిన ఘటన కుంటాల మండలం అంబకంటి తాండాలో జరిగింది. ఎస్సై అశోక్ కథనం మేరకు మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా కిన్వాట్ తాలుకా ఇస్లాపూర్ పంచాయతీ పరిధిలో గల తొటంబ గ్రామం మాన్‌సింగ్ తండాకు చెందిన రాథోడ్ సుమన్ బాయి (48) అనే మహిళ వరినాట్లు వేసేందుకు కుంటాల మండలంలోని అంబకంటి తాండాకు వచ్చింది. వరినాట్లు వేసే సమయంలో ఒకేసారిగా సొమ్మసిల్లి కుప్పకూలింది. పరిస్థితి గమనించిన స్థానికులు కుంటాల ఆసుపత్రికి తరలించారు.వైద్యుల సూచన మేరకు భైంసా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా బీడీ ఆకు రవాణా చేస్తున్న వ్యక్తి పట్టివేత

ఉట్నూర్, జూలై31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉడుంపూర్ ప్రాంతం నుంచి ఉట్నూర్ మండలానికి అక్రమంగా బీడీ ఆకు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకోవడం జరిగిందని బీర్సాయిపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఈర్ల అరుణ తెలిపారు. ఉట్నూర్ మండలంలోని వడోనికి చెందిన జాదవ్ రవీందర్ టవేరా వాహనంలో అక్రమంగా రూ.30 వేల విలువ గల బీడీ ఆకును రవాణా చేస్తుండగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ లచ్చన్న, బీట్ ఆఫీసర్ సందీప్‌లు పట్టుకున్నారని తెలిపారు. టవేరా వాహనాన్ని సీజ్ చేసి అతని వద్ద ఉన్న 30వేల బీడీ ఆకును స్వాధీన పరుచుకున్నామని, రవీందర్ పై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రియాంక తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలన

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో మండల పరిషత్ పాఠశాలను ఎంపీడీవో రమేష్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట గ్రామస్తులతో పాటు ఎంపీఈఓ అఖిల్ కుమార్, కార్యదర్శి చిన్న గంగయ్య ఉన్నారు.

ఆదివాసుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత ఆదివాసుల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనపై మరింతగా పెరిగిందని రాజు గోండు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు పి. శంకర్ పేర్కొన్నారు. గురువారం ఆయనను మండల కేంద్రంలోని మొబైల్ పాయింట్ వ్యాపారి హమీద్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు బండారు శ్రీధర్ రెడ్డి, సోనే రావులు ఉన్నారు.

వీడీసీల పేరు మీద అక్రమ వసూలు చేస్తే కఠిన చర్యలు

తలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి కమిటీ పేరు మీద కానీ ఇతర దేని పేరు మీదనైనా గాని డబ్బులు వసూలు చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కమిటీ పేరు మీద డబ్బులు వసూలు చేసి బెల్ట్ షాపులకు అనుమతి ఇచ్చినట్లయితే అట్టి అనుమతి ఇచ్చిన వారిపైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటివరకు తలమడుగు మండలంలో కొన్ని గ్రామాలలో గ్రామ అభివృద్ధి కమిటీ పేరు మీదుగా డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం ఉందన్నారు. ఎస్ఐ రాధిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతపై.. 'నకిలీ' పిడుగు!

(5వ పేజీ తరువాయి...)

వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయని ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్తే.. వ్యాపారులు ఇచ్చిందే మందు, చెప్పిందే ధరగా మారుతుంది. అలాగే అధిక మార్జిన్ ఉన్న పురుగు మందులను రైతులకు అంటగడుతు చేతులు దులుపుకుంటున్నారు. అన్నిరకాల చీడపీడలకు ఒకేరకమైన పురుగు మందులను ఇవ్వడంతో రైతులు నష్టపోతున్నారు. పలుమార్లు రసాయన మందుల పిచికారితో పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగి పోతున్నాయి. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించకుండానే పురుగు మందులను విక్రయించడంతో వృదాగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో పంటలు రంగుమారిపోవడం లేదా ఎండుముఖం పట్టడం లాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. పిచికారి చేసిన తర్వాత పంట రంగును చూసి అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదంటూ చేతులెత్తేస్తున్నారు.

మాయమాటలు చెబుతూ..

కొంత మంది వ్యాపారులు రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ పురుగు మందులను అంటగడుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల ఇంద్రవెల్లి మండలం బుర్సన్‌పఠాన్ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె విలాస్ అనే రైతు ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మహాన్వికా ఫర్టిలైజర్ నుంచి షాపు నిర్వాహకుడి సలహా మేరకు పత్తి పంట ఎదుగుదలకు కాన్‌ఫీడర్ ఆల్‌బెల్ట్ సోల్యూషన్ అనే కిలో మందు ప్యాకెట్లను కొనుగోలు చేసి పత్తి పంటకు పిచికారి చేశాడు. దీంతో పిచికారి చేసిన రెండు ఎకరాల పత్తి పంట పసుపు రంగులోకి మారిపోయి అసలు ఎదుగుదలనే లేకుండా పోయిందని వాపోతున్నాడు.ఈ విషయాన్ని షాపుయజమానికి తెలిపిన అసలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.ఇప్పటి వరకు రెండు ఎకరాలకు రూ.50వేల వరకు పెట్టుబడి ఖర్చు అయిందని వాపోతున్నాడు. పంట పసుపు రంగులోకి మారడంతో ఏమి చేయాలనో తెలియక ఆందోళనకు గురవుతున్నాడు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

దిలావర్‌పూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ తండాలో గురువారం ఉదయం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన బి. నవీన్ తన రెండు ఎద్దులను పొలానికి తీసుకెళ్తుండగా రోడ్డు పక్కనే తెగిపడిన 11 కేవీ విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే గ్రామస్థులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. కాగా బుధవారం సాయంత్రమే విద్యుత్ తీగ పడి ఉండొచ్చని, అటువైపు ఎవరు వెళ్లకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ తెగిన విషయం ఎద్దు మృత్యువాత పడే వరకు తెలియదన్నారు. తెగిన విద్యుత్ తీగ రోడ్డు పక్కనే ఉన్న పచ్చని గడ్డిలో పడటం వల్ల ఎవరు గమనించలేకపోయారని, మృతి చెందిన ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు నవీన్ చెప్పారు. విద్యుత్ శాఖ బాధిత రైతు నవీన్‌కు నష్టపరిహారం అందించాలని కాల్వ తండా గ్రామస్థులు కోరారు. స్థానిక లైన్‌మెన్ నరహరి సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయించారు. ప్రమాదాన్ని ఉన్నతాధికారులకు వివరించి రైతుకు న్యాయం చేస్తామని లైన్ మెన్ నరహరి చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కుభీర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కుభీర్ మాదిగ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోనేకర్ విఠల్, ఉపాధ్యక్షులుగా గోరేకర్ దేవా, కోశాధికారిగా గోరేకర్ ఆనంద్‌తో పాటు పలువురు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోనేకర్ విఠల్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్ శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ సంతోశ్, నాయకులు రాములు, నాగలింగం, రాజన్న, సతీశ్, విఠల్, సాయినాథ్, ధర్మకిరణ్, గౌతం, తదితరులున్నారు.

ఐరిస్‌తో పింఛన్ పంపిణీ

సారంగాపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ల పంపిణీలో అవకతవకలు జరుగకుండా ఐరిస్ విధానంలో పింఛన్‌లను పంపిణీ చేసే విధానాన్ని తీసుకొచ్చింది. జూలై నెలకు సంబంధించిన పింఛన్‌లను ఐరిస్ (కన్ను) స్కాన్ ద్వారా పోస్టాఫీస్ సిబ్బంది గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో లబ్దిదారులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. గతంలో ఫింగర్‌ప్రింట్ మిషన్ ద్వారా పింఛన్ ద్వారా పంపిణీ చేసేవారు. ఫింగర్‌ప్రింట్ మిషన్‌ను ప్రభుత్వం రద్దు చేసి ప్రస్తుతం ఆఫీస్ అధికారి ఫోన్‌యాప్ ద్వారా లబ్దిదారుల కళ్లను స్కాన్ చేసి పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తున్నారు. అర్హులైన లబ్దిదారులకు ఐరిస్ మిషన్ కళ్లను స్కాన్ చేయకపోతే పాత పద్దతిలో ఫింగర్ ప్రింట్ ద్వారా పింఛన్‌లను ఇవ్వనున్నట్లు పోస్టాఫీసు అధికారులు తెలిపారు.

భైంసా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

భైంసా, జూలై 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసా ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బుధవారం రాత్రి స్థానిక శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి మాత మందిర అవరణలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు విలాస్ గాదేవార్ సమక్షంలో ప్రధాన కార్యదర్శి గుజ్జల్‌వార్ సాయినాథ్, కోశాధికారి దర్బార్ శ్రీశైలం పరిశీలకులుగా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఇందులో అధ్యక్షులుగా దమ్‌కొండవార్ సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా చందువార్ సంతోష్, కోశాధికారిగా ముత్యాప్‌వార్ రాజు, సహ కోశాధికారిగా బుడ్డెవార్ రాజు, ఉపాధ్యక్షులుగా బచ్చువార్ శంకర్ యాదవ్, ముత్యప్‌వార్ శేష్ నారాయణ, బచ్చువార్ సచిన్, సంయుక్త కార్యదర్శులుగా లాబిశెట్టివార్ ప్రవీణ్, ఆర్వపెల్లి మహేష్, కౌటిక్‌వార్ కృష్ణ, డి.శ్రీధర్, పీఆర్‌వోగా చిట్మల్‌వార్ రవి, సాంస్కృతిక కార్యదర్శులుగా గుజ్జల్‌వార్ గోపి, బచ్చువార్ కళ్యాణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు విలాస్ గాదేవార్ భైంసా సంఘ నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ నూతన కార్యవర్గ ప్రతినిధులు సంఘ బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో పాటుపడాలని సూచించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

కుబీర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉత్తమ సేవలందించిన వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కుబీర్ ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సంతోష్ అన్నారు. గత పది సంవత్సరాలుగా ఏపీఎంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన భైండ్ల రమేష్‌కు గురువారం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. డ్వాక్రా మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న టేలాను తొలగించండి

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వెనుక ఉన్న పాన్ డబ్బాను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గత 20 రోజుల క్రితం తేలా తొలగించాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇంతవరకు దానిని తొలగించలేదని అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. మూలమలుపు వద్ద ఇది ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీంపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని బీంపూర్ వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. ఆయన గురువారం సిబ్బందితో కలిసి మండలంలోని గుంజల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలతో పాటు గ్రామంలో పీఎం జన్మన్ వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు ఐరన్ ఫోలిక్ సిరఫ్ తగ్గించడం , ఐరన్ ఫోలిక్ యాసిడ్ బిళ్ళలను మింగించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలాల ఆరోగ్య విస్తరణ అధికారి లింగం పల్లి జ్ఞానేశ్వర్, ప్రధాన ఉపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి,సిబ్బంది ఉమ ,సాయి పాల్గొన్నారు.



గుంజలలో గ్రామస్తులకు మందులను ఇస్తున్న ఆరోగ్య సిబ్బంది


రోడ్డుపైకి వచ్చిన ముళ్ల చెట్ల పొదలు

రోడ్డెక్కిన ముళ్ల పొదలు

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం నుంచి ఘన్‌పూర్ వైపు వెళ్లే రహదారిపై పక్కన ఉన్న ముళ్ల చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వచ్చాయని, దీంతో ఈ రూట్‌లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టు జారితే.. ప్రమాదమే!


బురదమయంగా మారిన రోడ్డు

దిలావర్‌పూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కాల్వ గ్రామంలో కొత్త కాలనీలో వర్షపు నీరు నిలిచి రోడ్డు బురదమయంగా మారింది. ఆ కాలనీ వాసులు ఎటు వెళ్లాలన్న ఈ రోడ్డే గతి. నడుస్తే పట్టు తప్పి జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నట్లు కొత్త కాలనీ వా సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి రోడ్డును బాగుచేయాలని అధికారులను కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- నిర్మల్ జిల్లాలో 931 అంగన్‌వాడీ సెంటర్లు
- గర్భిణులు 5,193, తల్లులు 4,631
- 7 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 45,005

ముథోల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో తల్లికి మించిన దైవం లేదు. అమ్మ పాలకు మించిన అమృతం లేదంటారు. నవ మాసాలు గర్భంలో ఉండి అమ్మ నుంచి అందుకున్న తొలి వరం కమ్మనైన క్షీరం అ మ్మ పాలు బిడ్డకు అమృతం వంటివి. నేటి నుంచి వారం రోజుల పాటు జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికతో సిద్ధంగా ఉన్నారు. మన దేశంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి. పిల్లలు ఆరోగ్యవంతులుగా పెరిగి అభివృద్ధి చెందడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల వారు సరైన పోషణ విధానంగా తల్లి పాల ను సిఫార్సు చేస్తున్నారు. బిడ్డ ఆరోగ్యం తల్లి పాల నుంచే వ స్తుంది కనుక బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రా రంభించాలి. మొదట ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే ఇప్పించడం, ఆరు నెలల మీదట అనువైన కుటుంబ ఆహారం అదనంగా ప్రారంభించడం, తల్లిపాలు రెండేళ్ల వయ స్సు వరకు లేదా వీలైనంత కాలం ఇప్పించడం చేయాలి. తల్లిపాలు తాగడం నుం చే బిడ్డ ఆరోగ్యం ఆరంభం అవుతుంది. ఇవి శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజ సిద్ధమైన టీకా వంటివి. ఇవి సహజమైన పునరుత్పాదకమే కాకుండా వ్యర్థాలు, కాలు ష్యం లేని వనరు. బిడ్డకు ఈ పాలు ఎంతో శ్రేష్టమే కాక పౌష్టికాహారం కూ డా శిశువుకు తల్లిపాలకు మించిన ఆహారం లేదు. ఇవి ప్రోటీన్లు, విటమిన్లు, పిండి పదార్థాలు, కాల్షియం, పొటాషియం, ఖనిజాలు, సూక్ష్మపోషకాలు అవసరమైన మేరకు పుష్కలంగా ఉండడం వల్ల తగినంత బరువు పెరుగుతారు. వీటిలో శక్తివంతమైన ప్రతిరోధకాలు ఉన్న కారణంగా అంటువ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, సం బంధిత వ్యాధులు సెప్సిస్, నిమోనియా, డయేరియా నుంచి శిశువును కాపాడుతాయి. వీటిలో ఫ్యాటీ యాసిడ్స్ బిడ్డ మెదడు బిడ్డ మెదడు పెరుగుదలకు దోహ దం చేయడం వలన తెలివితేటలు పెరుగుతాయి. ప్రసవం అయిన వెంటనే మొ దటి అరగంట నుంచి ఒక గంట వ్యవధిలో తల్లిపాలలో కో లాస్ట్రం ఉంటుంది. ఈ పాలు ఎంత తొందరగా తాగించడం మొదలుపెడితే అంత మంచిది. బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంతో పాటు ఇంతకు ముందు చెప్పుకున్న లాభాలన్నీ పొందవచ్చు. శిశువు జీవితంలోని మొదటి నెలలకు అవసరమైన శక్తిని, పోషకాలను తల్లిపాలు అందిస్తాయి. బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు త ల్లి పాలు మాత్రమే పట్టాలి. ఈ ఆరు నెలలు చాలా కీలకం. తల్లిపాలల్లో ఎనభై శాతం కం టే ఎక్కువ నీరు ఉంటుంది.

నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు..

జిల్లాలో నేటి నుంచి ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్స కార్యక్రమాలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 931 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో గర్భిణీలు 5,193 మంది, తల్లులు 4,631 మంది, ఏడు నెలల నుండి ఆరు సంవత్సరాల వయస్సు వరకు పిల్లలు 55,339 మంది ఉన్నారు. ఇందులో ఒక సంవత్సరం నుంచి మూడేళ్ల పిల్లలు 21,110 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు 23,894 మంది ఉన్నారు. జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలో 249 అంగన్‌వాడీ సెంటర్లకు గాను గర్భిణులు 1145, తల్లులు 949 మంది, ఏడు నుంచి ఆరేళ్ల పిల్లలు 11,507 మంది ఉన్నారు. నిర్మల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 297 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా గర్భిణీ స్త్రీలు 1979 మంది, తల్లులు 1784, ఆరు సంవత్సరాల పిల్లలు 21,234 మంది ఉన్నారు. భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 205 అంగన్‌వాడీ సెంటర్లు, గర్భిణీ స్త్రీలు 1193, తల్లులు 1096, ఆరేళ్ల లోపు పిల్లలు 11,965 ఉన్నారు. అలాగే ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 180 అంగన్‌వాడీ సెంటర్లకు గాను గర్భిణులు 876, తల్లులు 802, పిల్లలు 10,633 మంది ఉన్నారు. తల్లి పాల వారోత్సవాలు ప్రతీ సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం మాతృపాల ప్రాధాన్యతను పునరుద్ఘాటించడం, తల్లులకు తగిన మార్గనిర్దేశం చేయ డం, పాలిటపోతుల మధ్య అవగాహన పెంచడం. ఆగస్టు 1న తల్లిపాల వారోత్సవాల ప్రారంభ సభ, స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు పోస్టర్లు, బ్యానర్లు, విడుదల, 2న తల్లులకు అవగాహన సెమినార్లు, గర్భిణీ కొత్త తల్లుల కోసం శిక్షణ కార్యక్రమాలు, మాతృపాలు ఇవ్వడంలో ముఖ్యమైన మార్గదర్శకాలు, డాక్టర్లు, నర్సుల ప్రసంగాలు, 3న పౌష్టికాహారంపై అవగాహన, తల్లులకు, శిశువులకు సరైన ఆహారపు అలవాట్లు, 4న మాతృపాల సహాయక గదుల ప్రారంభం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో, బస్టాండ్‌లలో తాత్కాలిక మాతృపాల గదుల ఏర్పాటు, బహిరంగ ప్రదేశాల్లో మాతృపాల గౌరవాన్ని పెంచే కార్యక్రమాలు, 5న మల్టీ మీడియా ప్రచారాలు రేడియో, టీవీ, సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు 6న సమాజ భాగస్వామ్య దినం, మహిళలు కుటుంబ సభ్యుల పాత్రపై చర్చలు, తండ్రుల పాత్రపై అవగాహన, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల గౌరవ కార్యక్రమాలు, 7న ముగింపు సభ వారాంతపు సారాంశం. ఉత్తమ శిశు పోషణ మాతృపాల ప్రోత్సాహకులకు బహుమతులు, స్వయం సహాయక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడం, తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతిజ్ఞ ఉంటుంది.


తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

తల్లిపాల విశిష్టతను వివరించాలి
- సరోజిని, సీడీపీవో, ముథోల్



తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏడు రోజులపాటు తల్లిపాల విశిష్టతను తెలియజేయడం, గర్భిణులకు తల్లులకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలపై వివరించడం చేస్తాం. ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలియజేస్తాం. అలాగే పౌష్టికాహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పిస్తాము. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భిణులు, తల్లులు, పిల్లలకు ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి. తల్లిపాలు ఒక విశిష్టత ఏమిటి వాటి గురించి ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్త ఈ తల్లిపాల వారోత్సవాల భాగంగా ఆరోగ్య శాఖ సహకారం తీసుకొని తెలియజేయడం జరుగుతుంది.

సన్నాహక గర్జన సభను

విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, చేయూత పెన్షన్‌ల సన్నాహక గర్జన సభను ఆగస్టు 4న పట్టణంలోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి ప్రేమ్‌రాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు నాలుగున పట్టణంలో నిర్వహించే సభకు వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని ప్రేమ్ రాజ్ తెలిపారు. సభకు దివ్యాంగులు, వింతువులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్, వికలాగుల హక్కుల పోరాట సమితి నాయకులు షేక్ మహేబూబ్, కిషోర్, సోన్ కాంబ్లే దేవిదాస్, కినక కిషన్, షకిల్, విలాస్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారుడికి కలెక్టర్ సన్మానం


చరణ్ తేజను సత్కరిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, జూ లై 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సబ్ జూనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచిన పట్టణానికి చెందిన కొమ్ము చరణ్ తేజను కలెక్టర్ రాజర్షి షా సత్కరించారు. త్వరలో జరగనున్న రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలోనూ చరణ్ తేజ పాల్గొననున్న నేపథ్యంలో ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. మరిన్ని విజయాలు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో

గాయపడ్డ వ్యక్తికి ఆర్థికసాయం


చాకటి దేవ్ రావ్‌కు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎలుగు బం టి దాడిలో గాయపడిన వ్యక్తికి రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్ రాజర్షి షా అం ద జేశారు. వాఘాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ కొలాం గిరిజనుడు చాకటి దేవ్‌రావ్ మే నెలలో ఎలుగుబంటి దాడిలో గాయపడ్డారు. కాగా బాధితుడికి మంజూరైన రూ.50 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, గ్రామస్థులు భూపెల్లి శ్రీధర్, కుదురుపాక సురేష్, మర్సకోల అశోక్, మర్సకోల గౌతమ్, గోస్కూరి రాజేందర్, చాకటి రాము పాల్గొన్నారు.

చిట్టడవిని తలపిస్తున్న పల్లె ప్రకృతి వనం

దిలావర్‌పూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రకృతి వనం నిర్వహణను పట్టించుకోకపోవడంతో అది కాస్త చిట్టడవిని తలపిస్తోంది. పిచ్చి మొక్కలు, గడ్డితో నిండి అపరిశుభ్రంగా మారింది. మండల పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఐకేపీ, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాలను ఆనుకుని అనాథగా ఉన్న ప్రకృతి వనం అధికారుల కంట పడటం లేదా అని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా స్థానిక గ్రామ పంచాయతీ ఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ... వర్షాల వల్ల ఇబ్బంది ఏర్పడిందని త్వరలోనే పల్లె ప్రకృతి వనాన్ని శుభ్రం చేయిస్తామన్నారు.


చిట్టడవిని తలపిస్తున్న దిలావర్‌పూర్ పల్లె ప్రకృతి వనం

పట్టణ ఆస్పత్రులకు ఏజెంట్లుగా ఆర్ఎంపీలు

- పలు కంపెనీల నజరాణాలు
- ఆర్ఎంపీలకు బైకులు

బోథ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గం పరిధిలోని బోథ్, సోనాల, నేరడిగొండ మండలాలలోని కొంతమంది ఆర్ఎంపీ వైద్యులు నిర్మల్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా మారారు అన్న విమర్శలు వస్తున్నాయి. కడుపునొప్పితో ఆర్ఎంపీ దగ్గరకు వెళితే నీ కడుపులో గడ్డలు అయ్యాయి. నేను రాసి ఇస్తా నిర్మల్ వెళ్లి ఎక్స్‌రే తీసుకొని రా అంటూ అమాయకులైన వారిని టార్గెట్‌గా చేసుకొని ఎక్స్‌రే సెంటర్లకు పంపిస్తున్నారు. ఆర్ఎంపీ రాసి ఇచ్చిన చిట్టిని చూసి ఎక్స్‌రే ల్యాబ్‌లో డాక్టర్ కమిషన్ లెక్క గట్టి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

● ఆర్ఎంపీలకు నజరాణాలు

పలు మండలాలలో ఆర్ఎంపీలుగా పనిచేస్తున్న వారికి వివిధ కంపెనీల ఏజెంట్లు వచ్చి మా కంపెనీకి చెందిన మందులు రాసి ఇవ్వండి మీకు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేస్తే మీకు మా కంపెనీ తరఫున బైక్ గిఫ్ట్‌గా ఇస్తామంటూ వారి కంపెనీ మందులని రాసి ఇచ్చే విధంగా చూసుకుంటున్నారు. ఇటీవల టార్గెట్ పూర్తి చేసిన ఇద్దరు ఆర్ఎంపీలకు ఓ మెడికల్ షాపు యజమాని ద్వారా కంపెనీ వారు రెండు బైకులను కొనుగోలు చేసి ఇచ్చినట్లు సమాచారం. మరో మెడికల్ షాప్ యజమాని ఓ ఆర్ఎంపీ డాక్టర్ కారుకు నెలనెల కిస్తీ చెల్లిస్తున్నట్లు సమాచారం. నేరడిగొండ మండలంలోని ఒక గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ ఆ గ్రామంలో కడుపు నొప్పితో వెళ్లిన వారికి ఆపరేషన్లు అంటూ భయపెట్టి దాదాపు ఇప్పటి వరకు 80 మంది వరకు కడుపు కోతలు పోయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దర్జాగా ఆ డాక్టర్ మెడికల్ షాప్ ఏర్పాటు చేసుకొని ఆయన క్లినిక్‌లో నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్నాడని పలువురు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ప్రైవేట్ వైద్యం వలలో పడి అమాయక జనం విలవిలలాడిపోతున్నారు.

● ఏజెంట్‌గా కొంత మంది ఆర్ఎంపీలు

నిర్మల్, ఆదిలాబాద్ వంటి పట్టణాల్లోని ఆస్పత్రుల్లో మూడు, నాలుగు నెలలు కాంపౌండర్లుగా పనిచేసిన వారు ఎంతోమంది గ్రామాలకు వచ్చి ఆర్ఎంపీల అవతారం ఎత్తుతున్నారు. వారు గ్రామాల్లో వచ్చిరాని వైద్యంతో వైద్యం చేస్తూ పట్టణాలలోని ఆస్పత్రులకు దళారీలు ఏజెంట్లుగా మారుతున్నారు. కొంతమంది ఆర్ఎంపీ డాక్టర్ల దగ్గరకు వెళితే నీకు అపెండెక్స్ ఉంది, కిడ్నీలో రాళ్లు అయ్యాయి, మహిళల కైతే నీ గర్భసంచి చెడిపోయింది, నీ గర్భసంచిలో గడ్డలు అయ్యాయి. ఆపరేషన్ ఇప్పుడే అవసరం అంటూ భ యభ్రాంతులకు గురిచేసి అప్పటికప్పుడే నిర్మల్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇక్కడి నుంచి రిఫర్ అ యిన రోగులకు నిర్మల్‌లోని కొన్ని ఆసుపత్రులలో వేసే బి ల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఇందులో స్థానిక ఆర్ఎంపీ కమిషన్‌తో పాటు ఆస్పత్రి ఖర్చులు కలుపుకొని బిల్లులు వేస్తున్నట్లు ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

ముఖ గుర్తింపుతో పింఛన్ల పంపిణీ


ముఖ గుర్తింపుతో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బజార్‌హత్నూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని తపాల కార్యాలయం వద్ద లబ్ధిదారులకు గురువారం ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు అందించారు. మండల కేంద్రంతో పాటు కొల్హారి,చిన్నహత్నూర్, బాలాన్‌పూర్ గ్రామాల లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆకగా మొదటి సారిగా ఆన్‌లైన్ యాప్ ద్వారా ముఖ గుర్తింపు పింఛన్లు పంపిణీ చేయడంతో కొద్దిపాటి అంతరాయం ఏర్పడిన అదిగమించి కొనసాగించారు. సంబంధిత సెల్‌ఫోన్లు తపాల సిబ్బందికి ఇంకా అందించలేదు. అయినప్పటికి సిబ్బంది పోస్టాఫీసుల్లో ఈ కొత్త విధానంలో పింఛన్లు అందిస్తున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన

పోలీసు అధికారులకు సన్మానం

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సుదీర్ఘకా లం పాటు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు అధికారులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఘనంగా సత్కరించారు. ఏఆర్ ఎస్సై జి.సంతోష్ రెడ్డి, ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాథోడ్ గణపతి ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో కుటుంబ సభ్యుల నడుమ వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైనా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు.

ప్రదర్శనను తిలకించిన

వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆకాంక్ష హాట్ ప్రదర్శనను వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. స్టూడెంట్ ఇన్‌చార్జి డాక్టర్ మంజులత నేతృత్వంలో స్టాళ్లను పరిశీలించి ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ ఉత్పత్తుల, తయారి విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది డాక్టర్ డి.కుమార స్వామి, డాక్టర్ జయచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై డీఈఓకు వినతి

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బేల మండల ఎంఈవో, ఎంఎన్‌ఓలు పదవి విరమణ పొందిన నేపథ్యంలో నూతన ఎంఎన్‌వో నియామకం జరపని పీఆర్‌టీయూ తెలంగాణ నేతలు కోరారు. ఈ విషయమై డీఈవో శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా నూతన విద్య సంవత్సరంలో నమోదైన విద్యార్థుల సంఖ్య పాఠశాలల వారీగా ఇవ్వాలని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందే విధంగా చొరవ చూపాలన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ సూపర్ వైజర్ అడిగాం సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని జడ్పీఎస్ఎస్ తేజాపూర్‌లో జరిగిన ఆరోగ్య పాఠశాలలో పొగాకు, ఆల్కాహల్, గంజాయి గుట్కా వంటి యాంటీ డ్రగ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో డ్రైడే పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ నివాస ప్రాంతాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. లేనియెడల దోమలు వృద్ధి చెంది వాటి కాటుతో మలేరియా, చికెన్ గున్య, డెంగ్యూ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాయన్న, స్కూల్ హెచ్ఎం మణిలత, ఆశా భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

కనుమరుగవుతున్న క్రీడా ప్రాంగణం

తాంసి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తాంసిలో క్రీడా ప్రాంగణం కనుమరుగైపోతుందని యువకులు గురువారం ఆంధ్రజ్యోతితో పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణంలో కేజీబీవీ, విలేజ్ పార్కు, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టడంతో ఆరు ఎకరాలు ఉన్న ప్రాంగణం రెండు ఎకరాలకు వచ్చిందన్నారు. గతంలో ఇక్కడ రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో వంటి పోటీలు జరిగాయని తెలిపారు.నిర్మాణాల కోసం గ్రౌండ్ వాడటంతో ఆటలు ఆడుకోలేకపోతున్నామని వాపోయారు. దీనిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

పూల మొక్కలకు పుష్కలంగా గిరాకీలు


పూల మొక్కలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

ముథోల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు మూడు రోజులుగా కురిసిన వర్షం కారణంగా మార్కెట్‌లో పూల మొక్కలకు గిరాకీ పెరిగింది. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంటి ముందర స్లాబ్ పైన వివిధ రంగుల పూల మొక్కలు నాటేందుకు ప్రకృతి ప్రేమికులు, పూల మొక్కల అభిమానులు వాటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద బంతి, చామంతి, మల్లె, గులాబీ, మందారం, చక్రం పూలు, వివిధ రకాల పూల మొక్కలు రావడంతో ప్రజలు వాటిని కొనుక్కునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేకాకుండా గడ్డి జాతి మొక్కలు, కొబ్బరి చెట్లు ఇంటి అలంకరణ కోసం మొక్కలను కొనుగోలు చేస్తున్నారు.

చెరువుల్లోకి రాని నీళ్లు


మత్తడి ప్రాజెక్టు ఇంకా నిండని దృశ్యం


మొలకెత్తిన వరి నారు

- పండించే భూములు బీళ్లు
- ఆందోళన చెందుతున్న ధాన్యం పండించే రైతులు

ఉట్నూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):వానకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న భారీ వర్షాలు కురియక పోవడంతో చెరువుల్లో నీళ్లు రాక వరి పండించే పంట భూములు బీళ్లుగా మారుతున్నాయి. ఉట్నూర్ మండలంలోని మత్తడి ప్రాజెక్టు నిండితేనే ఉట్నూర్ ప్రాంతంలోని చెరువులకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. ఉట్నూర్ మండలంలోని బాయమ్మ కుంట, నేరేడు చెరువు, గంగన్నపేట, సరస్వతి చెరువు, ఎల్లమ్మ చెరువు, గోపాయిచెరువుల కింద పంట భూములు ఉన్న రైతులు వరి ధాన్యం సాగు చేస్తుంటారు. మత్తడి ప్రాజెక్టా చెరువు నిం డితేనే బాయమ్మ కుంట ఫీడర్ చానల్ ద్వారా ఉట్నూర్ ప్రాంతంలోని చెరువుల్లోకి కాలువల ద్వారా నీరు చేరితే రైతులు వరి ధాన్యం పం డించేవారు. కాని సాధారణ వర్షపాతం నమోదు కావడంతో చెరువుల్లో నీళ్లు లేక పంట భూములు బీళ్లుగా మారాయి. నేరేగు చెరువు, గంగన్న పేట చెరువు, ఎల్లమ్మ చెరువు, సరస్వతి చెరువుల కింద సుమారు 200 ఎకరాల్లో రైతులు వరి ధాన్యం పంట సాగు చేస్తు వస్తున్నారు. కేవలం గోపాయి చెరువు కింద మాత్రం కొందరు రైతులు వరి ధాన్యం సాగు ప్రారంభించారు.

బీళ్లుగా మారుతున్న భూములు..

ఉట్నూర్ మండలంలోని చెరువుల కింద వరి ధాన్యం సాగు చేసే రైతులు చెరువుల్లో నీరు చేరితే ధాన్యం పండించడానికి భూములను సిద్ధం చేసుకుని నారుమళ్లు వేశారు. వరి నారు అందుబాటులోకి వస్తున్న ధాన్యం పండించడానికి కావాల్సిన సాగునీరు ఇంకా చెరువుల్లోకి రాకపోవడంతో ధాన్యం పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు మాసంలోనైనా భారీ వర్షాలు కురిస్తే వరి ధాన్యం పండిస్తామని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ బావులు ఉన్నరైతులు మాత్రం తమ తమ భూముల్లో అక్కడక్కడ వరి ధాన్యం పంట సాగు ప్రారంభించారు.

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయం తగదు

● తెలుగు యువత ఇన్‌చార్జి

ఆదిలాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని రాజకీయ చేయడం తగదని తెలుగు దేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ తెలుగు యువత ఇన్‌చార్జి నాగన్న అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రాజెక్టుతో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నట్లయితే పూర్తి ఆధారాలతో బయటపెట్టాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రాజెక్టుకు గతంలో సానుకూలమని ప్రకటించి ప్రస్తుతం వ్యతిరేకించడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ విషయమై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వ మధ్యవర్తిత్వంతో సానుకూలంగా సమస్యను పరిష్కరించుకుంటున్నారని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు న్యాయం జరగాలని బలంగా కోరుకుంటున్న నేపథ్యంలో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో గంగమ్మ, రవి, అర్జున బాయ్, తరుణ్, రాజక్క, సోనం కౌర్, తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలను స్వీకరిస్తున్న రంగు రవికిషన్

దేవాదాయ శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్‌గా రంగు

ఆదిలాబాద్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ దేవాదాయ శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్‌గా రంగు రవి కిషన్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇదే జిల్లాలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన.. ఇటీవల ఉద్యోగోన్నతి పొంది ఉమ్మడి నిజామాబాద్ సహాయ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. అదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సహాయ కమిషనర్ నవీన్ కుమార్ సెలవుల్లో వెళ్లడంతో ఆయన స్థానంలో రవి కిషన్‌ను సహాయ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లావ్యాప్తంగా నాకాబందీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం నుంచి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర సరిహద్దున ఉన్న ప్రాంతాలు, అంతరాష్ట్ర రహదారులు, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీలు జరిపారు. ఆయా మండలాల సరిహద్దుల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ముందస్తూ చర్యల్లో భాగంగా నాకాబందీ చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.


● పసుపు పచ్చగా మారిన పత్తి పంటను చూపుతున్న రైతు

అన్నదాతపై... నకిలీ పిడుగు!



ప్రతియేడూ.. జిల్లా పత్తి రైతులకు నకిలీ బెడద తప్పడం లేదు. ఇన్నాళ్లు నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు.. మళ్లీ నకిలీ రసాయన పురుగు మందులు, ఎరువులను అంటగడుతూ వ్యాపారులు అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. విత్తనం విత్తినప్పటి నుంచి పంట దిగుబడులు చేతికి వచ్చేంత వరకు ఏదో రకంగా అన్నదాతలు మోసపోతునే ఉన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల కట్టడికి అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అడ్డుకట్ట పడడం లేదు. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారు.జిల్లాలో ఈ యేడు 4లక్షల 40 వేల 336 ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

» జిల్లాలో జోరుగా నకిలీ రసాయన మందుల విక్రయాలు » వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల కరువు
» ఫర్టిలైజర్ వ్యాపారులు ఇచ్చిందే మందు.. చెప్పిందే ధర » ఇంద్రవెల్లిలో నకిలీ మందు పిచికారితో రంగుమారిన పత్తి పంట
» వ్యాపారుల మాటలు నమ్మి మోసపోతున్న అమాయక అన్నదాతలు

ఆదిలాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే పంటల సాగు పూర్తి కావడంతో ప్రస్తుతం రైతులు పత్తి పంటలో కలుపు తీయడం, దౌరలు కొట్టడం, ఎరువులు వేయడం, పురుగు మందులను పిచికారి చేయడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంటలు ఏపుగా పెరిగి కనిపిస్తున్నాయి. అయితే గత కొద్దిరోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు పత్తి పంటను చీడపీడలు ఆశిస్తున్నాయి. చీడపీడల నివారణకు పురుగు మందులను పిచికారి చేస్తూ రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఇటీవల ఇంద్రవెల్లి మండలం మర్కాగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బుర్సన్‌పఠార్ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె విలాస్ అనే రైతు పత్తి పంటకు పురుగుల మందులను పిచికారి చేయడంతో పత్తి పంట రంగు మారి పసుపు పచ్చగా మారిపోవడంతో ఆందోళనకు గురవుతున్నాడు. గతంలోను ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్న జిల్లా అధికారులు అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు.కొండ నాలుకకు మందు ఇస్తే ఉన్న నాలుక ఊడి పోయిందన్న చందంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో నకిలీ విత్తనాల బెడద, ఎరువులు, విత్తనాల కొరత, నకిలీ పురుగు మందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయిన వ్యవసాయ శాఖ అధికారుల క్షేత్ర స్థాయి పర్యవేక్షణ కరువవుతుంది. దీంతో అక్రమ, నకిలీ దందాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. తరుచుగా ఎరువులు, విత్తన, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేస్తూ సక్రమంగా రైతులకు ఎరువులు, రసాయన మందులను సరఫరా చేసే విధంగా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. అలాగే ఏఈఓలు, ఏఓలు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ పంటలను ఆశిస్తున్న చీడపీడలు, చేపట్టాల్సిన నివారణ చర్యల పై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలి. కాని కొంతమంది వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వైపే కన్నెత్తయిన చూడడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంతో రైతులకు ఉన్న సాగు అనుభవంతోనే పంటల సాగును చేపడుతు తీవ్రంగా నష్టపోతున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం

పురుగు మందులు, ఎరువుల విక్రయాల్లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా

(తరువాయి 6వ పేజీలో....)

ఫర్టిలైజర్ యజమాని ఇచ్చిన మందునే పిచికారి చేశా

: సోన్‌కాంబ్లె విలాస్, రైతు, బుర్సన్‌పఠార్ గ్రామం, ఇంద్రవెల్లి



పత్తి పంట ఎదుగుదలకు మహాన్వికా ఫర్టిలైజర్ యజమాని ఇచ్చిన పురుగు మందునే పిచాకిర చేశాను. దీంతో రెండు రోజుల్లోనే పత్తి పంట ఆకులు పసుపు రంగులోకి మారి కనిపిస్తున్నాయి. ఇంకా పంటకు ఏం జరుగుతుందోనన్న భయం ఉంది. వ్యాపారి, అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయ శాఖాధికారులే నాకున్యాయం చేయాలి.

రంగు మారిన పంటలను శాస్త్రవేత్తలు పంటను పరిశీలించాలి

: శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



ఇంద్రవెల్లి మండలంలో పురుగు మందులను పిచికారి చేయగా పసుపు రంగులోకి మారిన పత్తి పంటను శాస్త్రవేత్తలు పరిశీలించడం జరిగింది. దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. దిగుబడిపై ప్రభావం పడదని శాస్త్రవేత్తలు తెలిపారు. రైతు కొనుగోలు చేసిన కాన్‌ఫీడర్ ఆర్‌బెల్ట్ సోల్యూషన్ పురుగు మందుతో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు. మరేదో మందును పిచికారి చేయడం వలననే పత్తి పంట పసుపు రంగులోకి మారిపోయినట్లు తెలుస్తుంది. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నాం.

ప్రకృతి అందాలను పరిశీలించిన అధికారులు

తాంసి, జూలై 31(ఆంధ్రజ్యోతి): తాంసి మండలంలోని వివిధ ప్రాంతాల్లో వెలసిన ప్రకృతి అందాలను రాష్ట్ర పర్యాటక శాఖ సలహాదారు గురువారం పరిశీలించారు. వడ్డాడి, పాలోడి, లింబుగూడ, అంబుగావ్ తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడి పర్యాటక అందాలను పరిశీలించారు. జల జలా పారే నీటిని తిలకించారు. మత్తడి వాగు ప్రాజెక్టు నీటిలో ఎలాంటి ప్రత్యేకతలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ రాష్ట్ర సలహాదారు జయధీర్ తిరుమలరావు, జిల్లా పర్యాటక పరిశీలకుడు రవి, తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రితో ఎంపీ నగేష్ మాటామంతీ

కేంద్ర మంత్రి గడ్కరిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ గురువారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని రెండు జిల్లాలు, రెండు రాష్ట్రాలను కలుపుతు వెళ్లే 44వ జాతీయ రహదారి గుడిహత్నూర్ మండలం నుంచి ఆసిఫాబాద్ జిల్లా అక్కడి నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అల్లపల్లి ఎన్‌హెచ్ 354 వరకు వయా ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనూర్, కెరమెరి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్, కౌటాల, గుడెం, అల్లపల్లి వరకు రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లోని పలు రోడ్ల అభివృద్ధికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : ఏజెన్సీ వైద్యాధికారి

ఇంద్రవెల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులతో పాటు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు సిబ్బంది, సమయపాలన పాటించి వైద్యానికి వచ్చే రోగులకు అన్ని ఆరోగ్య పరీక్షలు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి ముందస్తు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యల గురించి సలహాలు, సూచనలు చేశారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలుంటాయని ఆయన పేర్కొన్నారు. అందుకే గ్రామాలలో ప్రతి ఒక్కరూ పరిసరాలను, పరిశుభ్రంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్టబొంగురం వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్, వైద్యాధికారులు డాక్టర్ వసంతరావు, డాక్టర్ పూజిత, సీహెచ్‌ఓ సందీప్, హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్లు పవార్ సురేష్, రాథోడ్ జలేందర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆస్పత్రులకు ఏజెంట్లుగా ఆర్‌ఎంపీలు

» పలు కంపెనీల మందులు విక్రయిస్తే నజరాణాలు
» ఇద్దరు ఆర్‌ఎంపీలకు ద్విచక్ర వాహనాలు

వివరాలు 7వ పేజీలో.....

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

● కలెక్టర్ రాజర్షిషా ● గుడిహత్నూర్, బజార్‌హత్నూర్‌లల్లో నూతన రేషన్ కార్డుల పంపిణీ ● పాల్గొన్న ఎమ్మెల్యే బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


గుడిహత్నూర్‌లో రేషన్ కార్డు అందజేస్తున్న కలెక్టర్, బోథ్ ఎమ్మెల్యే



బజార్‌హత్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, రానివారు ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్దిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. పేదవారికి ఆహార భద్రత కల్పించి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎవరైనా ఉచిత బియ్యాన్ని అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డును ప్రభుత్వం అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ స్రవంతి, డీఎస్ఓ వాజిద్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, తహసీల్దార్ కవిత రెడ్డి, ఎంపిడిఓ మాణిక్ ప్రభు, మన్నూర్ గుడిహత్నూర్ పీఏసీఎస్ చైర్మన్లు కరాడ్ ప్రకాష్, ముండే సంజీవ్ ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: అర్హులైన ప్రతీఒక్క కుటుంబానికి ఆహార భద్రత కార్డులు అందుతాయని ఆహార భద్రత కార్డుల అందజేత నిరంతర ప్రక్రియని జిల్లా కలెక్టర్ రాజార్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లు అన్నారు. ఆహార భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి హాజరైన అర్హులైన 160 మంది లబ్దిదారులకు రేషన్‌కార్డు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మొరం అవసరమైన అటవి శాఖ అధికారుల అనుమతులు ఇప్పించాలని కోలాంగూడ వాసులు విన్నవించగా.. నేరుగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ శ్యాంసుందర్‌ను ఆదేశించారు. ఆయా గ్రామాల ప్రజలు తమకు రవాణా సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు,రోడ్డు ఇబ్బందుల సమస్యలను సైతం విన్నవించారు.

● సహకార సంఘంలో కలెక్టర్ పరిశీలన

మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం తనిఖీ చేశారు. రైతులకు ప్రతిరోజు అందిస్తున్న ఎరువుల పంపిణీ తారు పై ఆరాతీశారు. యూరియా, డీఏపీ, ఇతర స్టాక్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. అక్కడే ఉన్న గిడ్డంగులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్‌డీఓ స్రవంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎంపీ నర్సయ్య, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఆత్మచైర్మన్ రాజు, పాక్స్ చైర్మన్ వెంకన్న, మండల అధికారులు, నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా నేరాల నియంత్రణకు కృషి

● బ్యాంకు అధికారులకు ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంతో నమ్మకంతో బ్యాంకుల్లో నగదు, బంగారు ఆభరణాలు జమ చేస్తారని, వారి నమ్మకం వమ్ము కాకుండా పోలీసు వ్యవస్థతో కలిసికట్టుగా పని చేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రధాన బ్యాంకుల అధికారులు, రీజనల్ అధికారులతో ఎస్పీ సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంకు లాకర్‌లు, ఏటీఎంల వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సెన్సార్లను, సీసీటీవీ కెమెరాలను, అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. అలారం వ్యవస్థ బ్యాంక్ అధికారులకు దగ్గరలో ఉన్న పోలీసు అధికారులకు వచ్చే విధంగా చూడాలన్నారు. నెలకు ఒకసారి ఏటీఎంల వద్ద, బ్యాంకుల వద్ద భద్రతా చర్యల విషయంపై సెల్ఫ్ ఆడిట్ చేసుకుంటూ పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అధిక మొత్తంలో నగదు తరలించే సమయంలో వీలైనంత సెక్యూరిటీ సిబ్బందిని ఉంచి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ సైతం పెరిగిపోయిన నేపథ్యంలో మోసాలకు పాల్పడుతున్న వారి అకౌంట్లను ఫ్రీజ్ చేసే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని, దీనికి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా ఒక సైబర్ క్రైమ్ బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు బి.సునీల్ కుమార్, సిహెచ్.కరుణాకర్ రావు, కె.ప్రణీదర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



● సమావేశంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు, సిబ్బంది (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

ఆదిలాబాద్ టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలో ఆగష్టు ఒకటవ తేదీ నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం స్థానిక పోలిసు ముఖ్య కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. డీఎస్పీ లేదా ఆపై స్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్‌లు, డీజేలు వంటి వాటికి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే శిక్షర్హులవుతారని అన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌తో సాగునీరు

● డిజిటల్ సర్వేను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం తేజాపూర్, పొచ్చెర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిజిటల్ సర్వే తేజాపూర్ సమీపంలో గురువారం జరుగగా సర్వే పనులు పరిశీలించి అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలుసుకున్నారు. ప్రాజెక్టు సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద బుగ్గారం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,800 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తేజాపూర్ పొచ్చెర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 4 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని అన్నారు. ఈ రెండు సర్వేలు పూర్తి కాగానే బజార్‌హత్నూర్ మండలం పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వే పూర్తి చేసి పనులు మొదలు పెడతామని అన్నారు. పిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఈ సర్వే ప్రైవేట్ సంస్థ నా భూమి నా హక్కు సివిల్ సర్వీస్ కంపెనీ ద్వారా డిజిటల్ సర్వే చేయడం జరగడంతో సంస్థ ప్రతినిధులు డీపీర్ సర్వే పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజనీర్ భీంరావ్. మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, తదితరులు ఉన్నారు.

అర్హులైన పేదలందరికి ఇంటి స్థలాలు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ఆయా గ్రామాలలో గల అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మరియు ఇళ్ల స్థలాలు అందించే విధంగా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం మండలంలోని బెల్గాం మరియు మండల కేంద్రమైన జైనథ్‌లో అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. దీంతో పాటు అధికారులు నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన ద్వారా అర్హులందరికి ఇండ్లు ఇస్తామన్నారు. ఇందుకు మధ్య దళారులను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జైనథ్ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్.కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్టిఅశోక్‌రెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లి కన్వీనర్ బోయర్ విజయ్, సీనియర్ నాయకులు కట్కంరాందాస్, జైనథ్ నాయకులు రాకేష్‌రెడ్డి, ప్రతాప్‌యాదవ్, సూర్య, మహిళలు పాల్గొన్నారు.

జీవో 49 శాశ్వతంగా రద్దు చేయాలి

● ఎమ్మెల్యేను కలిసిన తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు

ఉట్నూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 339 గ్రామాలను టైగర్ కన్జర్వేషన్ టైగర్ కారిడార్ పేరిట జీవో 49ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని రావడం సరికాదని, ఈజీఓను శాశ్వతంగా రద్దు చేసే వరకు తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తునే ఉంటామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వెడ్మబొజ్జును ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక విజయ్‌కుమార్ బృందంతో కలిసి వినతి పత్రాన్ని అందించి తమ ఉద్యమ వైఖరిని ఆయనకు స్పష్టం చేశారు. జీవో 49ని రద్దు చేయకుంటే మరింత ఆందోళన చేస్తామని ఖచ్చితంగా రద్దు చేయాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తుడందెబ్బ జిల్లా నాయకులు కొట్నాక జంగు, తుడందెబ్బ సోషల్ మీడియా కన్వీనర్ కుర్సెంగా భగవంత్‌రావు, యువ నాయకులు జాడేశ్రీనివాస్, కొట్నాక్ పాండురంగ్ పాల్గొన్నారు.


ఉట్నూర్‌లోఎమ్మెల్యే బొజ్జుకు వినతిపత్రం ఇస్తున్న తుడుందెబ్బ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్నాక్ విజయ్‌కుమార్